క్లుప్తంగా

ఏబీసీడీ వర్గీకరణ చేపట్టాలి



ఆత్మకూర్: రాష్ట్రంలో ఏబీసీడీ వర్గీకరణ పూర్తయిన తర్వాతనే గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 తదితర నియామకాలు చేపట్టాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గాంధీచౌక్‌లో మండల అధ్యక్షుడు దండు శ్రీనివాసులు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు ఐదోరోజు కొనసాగాయి. కార్యక్రమంలో అజ్జపాగ లక్ష్మణ్, సోంబాబు, జానకీరాం, జహంగీర్, రామకృష్ణ, మాసన్న, కృష్ణకుమార్, గాలిపంపు శ్రీను, కిషోర్, రాము, అనిల్, వెంకటన్న, కురుమూర్తి ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఆత్మకూర్: ఆత్మకూర్ మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఆత్మకూర్‌లో మార్నింగ్‌వాక్‌లో భాగంగా స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, ఆయా కాలనీల్లో పర్యటించారు. ఆస్పత్రిలో రోగులు పెరుగుతున్నారని, వారికి వైద్యం చేసేందుకు వైద్యులు లేరన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో పారిశుద్ధ్యం లోపించి దుర్వాసన వెదజల్లుతోందని ఆర్టీసీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సురేందర్, మల్లేష్, లక్ష్మణ్, స్వప్న, మహేందర్, శివ, తదితరులు ఉన్నారు.

రేచింతలలో వైద్య శిబిరం



ఆత్మకూర్: ప్రముఖన్యాయవాది, బార్‌అసోసియేషన్ ప్రధానకార్యదర్శి దివాన్జీ అశోక్‌రావ్ కుమారుడు డాక్టర్ రిషికేష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం విజయవంతమైంది. మండలంలోని రేచింతల గ్రామంలో మహాలక్ష్మి హోమియోపతి క్లినిక్ వైద్యులు 450 మంది గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి కావల్సిన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌రావ్, వెంకటన్న, మహేశ్వర్‌రెడ్డి, పుల్లారెడ్డి, బాలకిష్టన్న, సామేలు, శ్రీను,. సరోజ, రాఘవేంద్ర, యాదయ్య, మహేష్, బాబురావ్ తదితరులు పాల్గొన్నారు.

శబరిమల నుంచి మొదటి ఇటుక



కొత్తకోట రూరల్: కొత్తకోట పట్టణ శివారులో సర్వాంగ సుందరంగా నిర్మిస్తున్న గర్భాలయ నిర్మాణానికి మొదటి ఇటుకను శబరిమల దేవస్థానం తరఫున ఆలయ ప్రధాన తంత్రి కందరరు రాజీవరు, ప్రధాన అర్చకులు అరుణ్‌కుమార్ నంబూత్రిలు పంబా నదీ జలాలతో శుద్ధిచేసి ప్రత్యేక పూజలు నిర్వహించి అయ్యప్ప సేవాసమితి అధ్యక్షులు ధూపం నాగరాజుకు అందజేశారు. ఆలయ నిర్వాహకులు పాగాకు రాఘవేంద్ర ప్రసాద్, విశ్వమోహన్‌చారి, ప్రముక మేకప్‌మెన్ వేణు, గుడిబండ నాగిరెడ్డి, గన్నోజి వెంకటేష్ ఉన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి



అమరచింత: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి జీఎస్.గోపి తెలిపారు. మండలంలోని అమరచింత పట్టణంలోని 1 వ వార్డుతో పాటు నందిమళ్ళ గ్రామంలో ఆదివారం పర్యటించి అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీపీఎం నాయకులు వెంకటేష్, ఆజయ్, శ్యాంసుందర్, ఆర్‌ఎస్.రమేష్, రాఘవ, చంటి, రాఘవేంద్ర పాల్గొన్నారు.

కాల్వలకు మరమ్మతు జరిగేనా?



భీమా కాల్వలలో ఏపుగా పెరిగిన జమ్ము

- మండలంలో భీమా ద్వారా 15వేల ఎకరాలకు సాగునీరు
- ప్రధాన కాల్వలకు గండ్లు, కొట్టుకుపోయిన లైనింగ్
- చివరి ఆయకట్టుకు ప్రతియేట అందని నీరు
- ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా జమ్ము, కంప తొలగించాలి: రైతులు

వీపనగండ్ల: రైతులు ఆర్థికంగా బలపడాలన్న సదుద్దేశంతో ప్రాజెక్టులు, పంట కాల్వల నిర్మాణం కోసం వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని చెబుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు మండలంలోని 14 గ్రామాలకు సాగునీరు అందిస్తున్న జూరాల భీమా కేఎల్ఐ ప్రధాన కాల్వలకు గండ్లు, కంపతారు చెట్లు, షిల్ట్ పేరుకుపోవడంతో చివరి ఆయకట్టు రైతుల పొలాలకు నీరులేక ఎండిపోతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా కాల్వలకు మరమ్మతు చేయాలని రైతులు కోరుతున్నారు.

10వేల ఎకరాలలో సాగు..

జూరాల ప్రధాన కాల్వ ద్వారా రంగవరం, గోపల్‌దిన్నె, వీపనగండ్ల, తూముకుంట, సంపత్‌రావుపల్లి గ్రామాల్లో 4 వేల ఎకరాల్లో వరి సాగు అవుతోంది. భీమా కాల్వల ద్వారా పుల్గర్‌చర్ల, రంగవరం, కల్వరాల, సంగినేనిపల్లి, బొల్లారం, వల్లభాపురం, నాగర్లబండతండా, తూముకుంట గ్రామాల్లో 9వేల ఎకరాల్లో వరి, 2వేల ఎకరాల్లో వేరుశనగ, 800 ఎకరాలలో కందులు, 650 ఎకరాల్లో ఆయిల్‌ఫాం, 4వేల ఎకరాలలో మామిడి తోటలు సాగవుతున్నాయి.

ప్రతి సీజన్‌లో ఇబ్బందులే..



జూరాల కాల్వకు చివరి ఆయకట్టుగా ఉన్న మా గ్రామ భూములు సాగునీరు అందక ప్రతి యేట పంటలు ఎండిపోతున్నాయి. ఎగువ వైపున ఉన్న కాల్వలో కంపతారు చెట్లు, జమ్ము తొలగిస్తే కొంత మేలు జరుగుతుంది. అధికారులు అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి.

– రామేశ్వర్‌రావు మాజీ సర్పంచ్, సంపత్‌రావుపల్లి

సింగోటం లింక్ కాల్వ పూర్తి చేయాలి



ఎన్నికల సమయంలో తమను గెలిపిస్తే 6 నెలల్లో సింగోటం రిజర్వాయర్ నుంచి గోపల్‌దిన్నె రిజర్వాయర్‌కు లింక్ కెనాల్‌ను పూర్తి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. రైతుల పంట భూములకు బహిరంగ మార్కెట్‌లో ఉన్న రేటును చెల్లించి సత్వరమే కాల్వను పూర్తి చేయాలి.

– సత్యనారాయణగౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు, వీపనగండ్ల

నిబంధనల మేరకే పనులు



గత సీజన్‌లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా పలు గ్రామాల్లో జమ్ము, కంపతారు చెట్లను తొలగించాం. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి రైతులకు ఉపయోగపడే పనులు ఈ సీజన్‌లో చేయిస్తాం. అవసరమయ్యే పనుల ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపిస్తాం.

– శ్రీనివాసారావు ఎంపీడీఓ, వీపనగండ్ల



పాడైన పంట కాల్వలు



జూరాల ప్రధాన కాల్వలో రాళ్ల కుప్పలు

మద్యం మత్తులో వాహనాలు నడుపొద్దు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సురేష్

అమరచింత: మద్యం మత్తులో వాహనాలను నడిపి తమ విలువైన ప్రాణాలను పోగొట్టుకోవద్దని ఎస్ఐ సురేష్ అన్నారు. మండలంలోని చంద్రగడ్ గ్రామంలో ఆదివారం గ్రామ ప్రజలకు మైనర్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్‌లతో కలిగే ప్రమదాల గురించి అవగాహన కల్పించారు. పత్రాలు లేని వాహనాలపై ప్రయాణం చేస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామన్నారు.

శాసనసభ స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలి

- కేటీఆర్, జగదీశ్ రెడ్డిల దిష్టిబొమ్మలు దహనం



కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మదహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తిటౌన్: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను శాసనభలో ఏక వచనంతో మాట్లాడి అవమానించిన ఎమ్మెల్యే జగదీశ్ క్షమాపణ చెప్పాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీర్ల విజయచందర్ డిమాండ్ చేశారు. టీపీసీసీ పిలుపు, ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌక్‌లో కేటీఆర్, జగదీశ్వర్ రెడ్డిల దిష్టిబొమ్మలు దహనం చేశారు. బీఆర్‌ఎస్ దళితులను ఎప్పుడూ చిన్నచూపుగానే చూసిందని, ఆనాడు దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని హామీ ఇచ్చి దళితులను మోసం చేశారని, నేడు దళిత స్పీకర్‌ను ఏకవచనంతో మాట్లాడి అవమానపరిచారని మండిపడ్డారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆదిత్య, కౌన్సిలర్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: శాసనసభ స్పీకర్‌పై జగదీశ్‌రెడ్డి, కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఇద్దరి దిష్టిబొమ్మలు కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. కేటీఆర్‌పై కఠిన నిర్ణయం తీసుకుని వారి సభ్యత్వాన్ని రద్దు చేయాలని అన్నారు. వెంటనే వారిద్దరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి మండల ఇన్‌చార్జి సత్యశీలారెడ్డి, కొంకి వెంకటేష్, శివన్న, రమేష్, సుధాకర్‌రావు, శేఖర్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



గోపాల్‌పేటలో..

కొనసాగుతున్న నిరసన దీక్షలు



మోకాళ్ల మీద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వనపర్తిటౌన్: ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని రాష్ట్రంలో త్వరగా అమల్లోకి తీసుకురావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్న కేశవులు డిమాండ్ చేశారు. ఆదివారం మహానీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ ఎమ్మార్పీఎస్ కార్యకర్తలకు పూలదండలు వేసి నిరసన దీక్షను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమన్వయకర్త గంధం గట్టయ్య, ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకుడు వెంకటస్వామి, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, ఎమ్మార్పీఎస్ గోపాల్‌పేట మండల కన్వీనర్ పవన్ కల్యాణ్, తాడుపర్తి గ్రామం అధ్యక్షుడు రాజేందర్ పాల్గొన్నారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో బెల్టులు అందుకున్న విద్యార్థులతో క్లబ్ ఫౌండర్, సీనియర్ కరాటే మాస్టర్లు

కొత్తకోట రూరల్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో 'గాడ్స్ ఆన్ వారియర్స్ షోటోఖాన్ కరాటే అకాడమీ'కి చెందిన విద్యార్థులకు ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించినట్టు క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. ఈ పరీక్షల్లో 50మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చడంతో వారికి బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఎల్లో బెల్ట్ 15మంది విద్యార్థులు, ఆరెంజ్ 15మంది విద్యార్థులు, బ్లూ బెల్టులు 8మంది విద్యార్థులు, గ్రీన్ బెల్టులు 10మంది విద్యార్థులు, మెరూన్ బెల్ట్ ఒకరు, బ్రౌన్ బెల్ట్ ఒకరు సాధించారు. కార్యక్రమంలో క్లబ్ డిప్యూటీ ఫౌండర్ జి.హరీష్ యాదవ్, జాఫర్ సాదిక్. సీనియర్ కరాటే మాస్టర్లు జాంగిర్, హర్షవర్ధన్ ఉన్నారు.

సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి



రోడ్డుపై పారే మురుగు నీటిని పరిశీలిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

పాన్‌గల్: జిల్లాలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించే సీసీరోడ్లతో పాటు డ్రెయినేజీలు నిర్మించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ.కుతుబ్, జిల్లా మాజీ అధ్యక్షుడు సంతోష్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కేతేపల్లి గ్రామాన్ని సందర్శించి రోడ్లపై ప్రవహించే మురుగును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో సీసీ రోడ్లను మాత్రమే నిర్మించి రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీలను నిర్మించకపోవడంతో మురుగు ఇళ్లలోకి వస్తుందని పేర్కొన్నారు. డ్రెయినేజీ నిర్మించకపోవడంతో వర్షాకాలంలో వర్షపు నీటితో పాటు మురుగు ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉందని ప్రజలు వాపోతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నాయకులు స్పందించి సీసీ రోడ్లతో పాటు డ్రెయినేజీలు నిర్మించాలని లేనిచో ప్రజలతో కలిసి ఆందోళన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పెద్దహన్మంతు, రామదాసు, రామాంజనేయులు, కుర్మయ్య, స్థానికులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

పాన్‌గల్: ప్రహరీ విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడడంతో ఆదివారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ యాదగిరి తెలిపారు. హెచ్‌సీ వివరాల ప్రకారం.. మండలంలోని జమ్మాపూర్ గ్రామానికి చెందిన అన్నె కృష్ణయ్య, సోదరుడు అన్నె బాలపీరుకు ప్రహరీ విషయంలో ఇరువురికి మనస్పర్థలు ఉన్నాయి. ఈనెల 15న ఇరువురు ఘర్షణ పడి అన్నె కృష్ణయ్య, అతని భార్య అన్నెనాగమ్మపై అన్నె బాలపీరు రాళ్ళతో దాడిచేసి గాయపర్చాడు. ఇదే విషయంలో అన్నె బాలపీరు, అతని భార్యపై అన్నె కృష్ణయ్య, అతని భార్య అన్నె నాగమ్మ బూతులు తిడుతూ కట్టెతో, రాళ్ళతో దాడి చేశారు. ఇరువురు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ఖిల్లాఘనపురం: మండలంలోని మల్కిమియాన్‌పల్లి గ్రామంలో ఆదివారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గ్రామానికి మంజూరైన జాతీయ ఉపాధిహామీ నిధులు రూ.7 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు కాంగ్రెస్ నాయకులు రవి నాయక్ తెలిపారు. గ్రామానికి ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.10 లక్షలు మంజూరైనట్లు ఆయన చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ ఏఈ రమేష్‌నాయుడు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి నిధులతో చేపట్టే సీసీ రోడ్ల పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనువాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బాలయ్య, సుధాకర్‌రెడ్డి, మన్యంపు రెడ్డి, రమేష్. సత్తయ్య పాల్గొన్నారు.

నేడు క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

పాన్‌గల్: మండలంలోని చింతకుంట గ్రామంలో సోమవారం క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామానికి అంబులెన్స్‌లో మొబైల్ ఎక్స్‌రే, తేమ పరీక్షల యంత్రాలతో సిబ్బంది హాజరై పరీక్షలు నిర్వహిస్తారన్నారు. గ్రామస్తులు అందుబాటులో ఉండి పరీక్షలు చేయించుకోవాలన్నారు.

చోర్ బజార్..

- సంతలో దొంగల హల్‌చల్
- సెల్‌ఫోన్లు, నగదు చోరీ
- పెట్రేగిపోతున్న దొంగలు
- బెంబేలెత్తిపోతున్న జనం

ఆత్మకూర్: మున్సిపాలిటీ పట్టణంలో ఆత్మకూర్ సంత.. చోర్ బజార్‌గా ప్రాచుర్యం పొందుతోంది. ప్రతివారం పదేసీ ఫోన్లు, వేలల్లో నగదు చోరీకి గురవుతుండడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. పోలీసుల నిఘా వైఫల్యం కారణంగా దొంగలు పెట్రేగిపోతున్నారని, సంతలో హల్‌చల్ చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

వారం వారం ఇదేతంతు..

ప్రతి ఆదివారం ఆత్మకూర్‌లో సంత కొనసాగుతోంది. కొత్తకోట, చింతుకుంట, దేవరకద్ర, గద్వాల, మదనపూర్, అమరచింత, నర్వ తదితర మండలాల నుంచి వినియోగదారులు, వ్యాపారులు పెద్ద ఎత్తున వస్తుంటారు. దీన్ని అదునుగా భావించి దొంగల ముఠా పెట్రేగిపోతోంది. ప్రతివారం పదుల సంఖ్యలో ఫోన్లు చోరీకి గురికావడం, నగదు చాకచక్యంగా దోచుకెళ్తున్నారు.



ఆత్మకూర్ సంతలో రద్దీగా వినియోగదారులు

ఫిర్యాదుల వెల్లువ..

ఆత్మకూర్ సంతలో ఫోన్లు, నగదు పోగొట్టుకుంటున్న బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ప్రతి ఆదివారం 5కుపైగా ఫోన్లు చోరీకి గురైనట్లు ఫిర్యాదులు అందుతున్నాయని పోలీసులు అంటున్నారు. వంద, రెండొందలు, మూడు, నాలుగు, ఐదు వందల నగదు పొగొట్టుకుంటున్నవారు చాలా మంది ఉండగా, ఫిర్యాదు చేయకుండానే వదిలేస్తున్నారు. పోలీసులు గట్టి బందోబస్తు, నిఘా ఏర్పాటు చేసి దొంగలను పట్టుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

రూ.48వేల ఫోన్ పోయింది..



ఆదివారం ఆత్మకూర్ సంతకు సాయంత్రం ఆరుగంటల సమయంలో మా అమ్మతో కలిసి కురగాయాలు కొనేందుకు వచ్చాం. సంతలో కొద్దిగా రద్దీగా ఉన్న సమయంలో నా జేబులోంచి రూ.48 వేల విలువ చేసే వన్‌ప్లస్ ఫోన్‌ను కొట్టేశారు. వెంటనే తేరుకుని గాలించినా ఫలితం లేకుండా పోయింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాను.

– డాక్టర్ ఇలియాజ్, ఆత్మకూర్

దొంగలను పట్టుకుంటాం..



ఆత్మకూర్‌లో ఆదివారం జరుగే సంతలో వేలాది మంది వినియోగదారులు వస్తుంటారు. ఇదే అదునుగా భావించి దొంగలు ఫోన్లు, నగదును దోచుకెళ్తున్నారు. ఇది వరకు మఫ్టీలో పోలీసు సిబ్బందిని గస్తీ ఏర్పాటు చేసి గట్టి నిఘాను ఏర్పాటు చేశాం. చిన్నపిల్లలతో చోరీలు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి. ఫోన్లు, నగదు జాగ్రత్తగా ఉంచుకోవాలి.

– నరేందర్, ఎస్ఐ, ఆత్మకూర్

సారూ.. రోడ్డు బాగు చేయండి



గుంతల మయంగా సత్యహళ్లి-వడ్డెవాట గ్రామాల మధ్య రోడ్డు

కొత్తకోట రూరల్: మండలంలోని సత్యహళ్లి-వడ్డెవాట గ్రామాల మధ్యగల రోడ్డు గత కొన్నేళ్లుగా గుంతల మయంగా, ఏపుగా పెరిగిన కంపచెట్లతో రాకపోకలకు వీల్లేకుండా తయారైంది. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రోడ్డు గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ఇరు గ్రామాల ప్రజల ఇబ్బందులను గుర్తించిన స్థానిక కాంగ్రెస్ నాయకుల విజ్ఞప్తి మేరకు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి రూ.1.50కోట్లు మంజూరు చేసినట్టు గతేడాది అక్టోబర్‌లో ఇందుకు సంబంధించిన ప్రొసిడింగ్ సైతం బయట పెట్టారు. అయినా నేటికీ పనులు ప్రారంభం కాలేదు. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి రోడ్డు పనులు త్వరగా ప్రారంభించాలని, ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

'పల్లె ప్రకృతి వనం' ఎండుతోంది

కొత్తకోట రూరల్: గత ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం గ్రామాల్లో హరితహారం కార్యక్రమంలో భాగంగా పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. సర్పంచ్‌ల పదవీకాలం ఉన్నప్పటికీ వరకు పల్లెప్రకృతి వనాల నిర్వహణ బాగుండేది. సర్పంచ్‌లు లేకపోవడంతో వాటిని నిర్వహణ పంచాయతీ కార్యదర్శులకు ఇవ్వడంతో వారు ఇతర పనిభారంతో పల్లెప్రకృతి వనాల నిర్వహణను పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం 'పల్లెప్రకృతి వనంలో మొక్కల నిర్వహణ గాలికి వదిలేశారు. పల్లెప్రకృతి వనంలో మామిడి, ఉసిరి, సీతాఫలం, దానిమ్మ, వేపా తదితర మొక్కలు నాటారు. ప్రకృతి వనాన్ని అందంగా తీర్చిదిద్దుతామని ప్రారంభంలో అధికారులు చెప్పినప్పటికీ ప్రస్తుతం నిర్వహణ లేకపోవడంతో ప్రకృతి వనంలో మొక్కలన్ని ఎండిపోతున్నాయి. కొన్ని గ్రామాల్లో బోర్లు పనిచేస్తున్నప్పటికీ నీళ్లు పట్టడం లేదు. మరికొన్ని గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాల నిర్వహణ మొత్తం గాలికి వదిలేశారు. పల్లెప్రకృతి వనాలు ఏర్పాటు చేసి లక్షలాది రూపాయలు వెచ్చించినా లక్ష్యం చేరడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని వడ్డెవాటలో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనంలో మొక్కలు ఎండిపోతున్నాయి. కొంత కాలంగా అధికారులు పట్టించుకోకపోవడంతో గేటు సైతం విరిగిపోయింది. దీంతో పశువులు, మేకలు, గొర్రెలు అందులోకి వెళ్తున్నాయి. దీంతో మొక్కలు విరిగిపోయేందుకు అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి గేటు సరిచేయడంతో పాటు మొక్కలు ఎండిపోకుండా నీళ్లు పట్టే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



విరిగిపోయి కిందపడిన పల్లెప్రకృతి వనం గేటు



వడ్డెవాట పల్లె ప్రకృతి వనంలో ఎండిపోతున్న మొక్కలు